ఒకరికొకరు సర్వస్వమని, సమస్తమని బాసలు చేసుకున్నవారు చివరకు పెళ్లిలోనో, సహజీవనంలోనో ఒకరికొకరు సరిహద్దులుగా మారిపోతారు. స్వేచ్ఛ స్వైరంగా కనిపిస్తుంది. ఎదుటివారి సొంత అభిరుచులు భయపెడతాయి. స్నేహితులందరూ పరపురుషులవుతారు. వంద రేకలుగా వికసించే నవీన మహిళా వ్యక్తిత్వానికి, ఆధునిక అభద్ర పురుషాహంకారానికి జరిగే ఘర్షణ ఈ కథ.

కె.ఎన్. మల్లీశ్వరి

6

# శతపత్ర సుందరి





‘యుద్ధం ముగిసింది. ఒకరు విజేత. ఆ విజేతని నేను గెలిచాను... నేనే గెలిచాను. లోకం వెలివేసిన ఈ స్వైరిణి, విజేతని గెలిచింది. ఆహ్హాహ్హా...’ నాటకం క్లైమాక్స్‌లో ఈ డైలాగ్ చెప్పి స్టేజ్ మీద నిల్చున్న చోటనే గిర్రున తిరిగి కూలబడిపోవాలి. ఆ తిరగడం అన్నది రొటీన్‌గా కాదు ఆ పదిసెకండ్లలో రంగురంగుల పూసలతో కుట్టిన జలతారు కుచ్చుల చున్నీని, ఓడి మరణించినవాడి మొహంమీద పల్చని తెర కప్పినట్లుగా విసిరి, గెలిచి మరణించినవాడి వద్ద కూలబడాలి. ఈ ఒక్క సీన్ కోసం ఇంచుమించు వారంరోజులు నాతో ప్రాక్టీస్ చేయించాడు గౌతమ్. నాలుగొందలమందితో కిక్కిరిసిన ఆ చిన్న ఆడిటోరియం ఊపిరి బిగబట్టింది.

నా కళ్లముందు గౌతమ్ తప్ప ఎవరూ లేరు. మా ఇద్దరినీ కలిపి ఉంచే మహోద్వేగపు ప్రవాహమేదో నన్ను నడుపుతోంది. మేలిముసుగు అంచు పట్టుకోవడం వరకే గుర్తుంది. ఒంటి మీదకి తెలివి వచ్చేసరికి చప్పట్ల వర్షం. చాలామంది లేచి నిలబడ్డారు. కొంతమంది పరిచయస్థులు స్టేజ్ మీదకే వచ్చేస్తున్నారు. పక్కకి తిరిగి చూశాను. విస్మయంగా చూస్తూ గౌతమ్. రమ్మని చూపులతో పిలిచే ఉంటాను. చప్పున వచ్చేసి ఆప్యాయంగా హగ్ చేసుకున్నాడు.

“గ్రేట్! గౌతమ్! నీలవేణి నీ డిస్కవరీ,” ఎవరో పొగుడుతున్నారు తనని.

“నో నో షీ ఈజ్ వెరీ టాలెంటెడ్,” గాభరాగా క్రెడిట్‌ని తోసేస్తున్నాడు.

నవ్వుకుంటూ తలతిప్పి చూసేసరికి స్టేజ్ మీద ఉన్న కోలాహలం మధ్యనుంచి నా వద్దకి రాకుండానే మెట్లు దిగిపోతూ కనిపించాడు సదాశివ. అతని మొహం జేవురించి ఉండడం చూశాను.

✤

ఇంటికి వచ్చీ రాగానే ఫ్రెష్ అయి కూచున్నాను. మళ్లీ రేపటి నుంచీ ఆఫీస్‌కి వెళ్లిపోవాలి. నాటకం మత్తు వదుల్చుకుని రొటీన్‌లో పడిపోవాలి. సదాశివ వంటగదిలో మెసులుతున్న చప్పుడుకి కూడా కదలబుద్ధి కాలేదు. సన్న నూలుచీర ఒంటికి చుట్టుకున్నట్లు మనసుకు హత్తుకు పోయిన గౌతమ్ ఊహని విడదీయడం సాధ్యం కావడంలేదు. ఎలక్ట్రానిక్ కోయిల రెండుసార్లు కూసి ఊరుకుంది.

"యక్షుడూ యక్షిణీ చెరొక వియోగ శిఖరం మీదా కూచున్నారు. మేఘమాలా రాత్రంతా అప్పండవున్ చేస్తావా?" వాట్సప్ మెసేజ్.

అర్థంకోసం భావంకోసం ఒట్టి అక్షరాల కోసం అట్లా ఎంతసేపు చూస్తూ ఎన్ని సార్లు చదువుతూ ఉన్నానో. మొహం మీద చిటికెల చప్పుడు వినిపించేసరికి కావి లించుకున్న పూలతీగ నుంచి జర్రున కిందికి జారినట్లయి అయోమయంగా చూశాను. ఎదురుగా ఆరా చూపుల సదాశివ.

"ఏ లోకంలో ఉన్నావ్ నీలవేణీ?" మాటని కాస్త వంకర తిప్పి వదిలాడు. ఊనిక కూడా ఇట్టే అర్థమైపోతుంది. ఖర్మ... ఈ బుర్ర కాస్త తుప్పుబట్టి మొద్దుబారితేనేం! బలవంతంగా నవ్వాను. "సారసలోచనకి రసభంగమైతే సాలోచన అవుతుంది కదా? ఏమి నీ ఆలోచన స్వైరిణీ?" దగ్గరగా వచ్చి గుసగుసగా అన్నాడు.

స్వైరిణి! నన్ను స్వైరిణి అంటున్నాడు సదాశివ. స్వైరిణులను గురించి మేమి ద్దరం మురిసిపోయిన అర్థంలో కాదు. లోకం ఏమనుకుంటుందో అట్లా అంటున్నాడు. ఏ అర్థంలోంచయినా ఏ అద్దంలోంచయినా నేను స్వైరిణి కావడం నాకేం బాధలేదు కానీ సదాశివ ఉత్తినే నన్ను పలకరించలేదు. చాలా వెంటబెట్టుకుని వచ్చాడు. అలసటగా ఉంది. వాదించాలని లేదు. పోట్లాడాలని అస్సలు లేదు. డబుల్ కాట్ మీదకి చేరి తలవైపు గోడకి అమర్చి ఉన్న డ్రీమ్ బుక్‌షెల్ఫ్‌లో నుంచి మాయా ఏంజిలో ఆత్మకథ తీసుకున్నాను. ఐ నో వై ద కేజ్‌డ్ బర్డ్ సింగ్స్.

పరిగెత్తుకొస్తున్న చిన్నపిల్లల చేతిగ్లాసులో ఉద్రేకంగా తుళ్లిపడే నీళ్లలా సదాశివ లోని సంచలనం నాకు తెలుస్తూనే ఉంది. ఇపుడు మాట్లాడితే చర్చలు కాక వాదనలే జరుగుతాయి. ఇబ్బందికర సత్యాలే వాదనలు. ఎవ్వరం భరించలేం.

"నువ్వు స్థిమితంగా లేవు సదా, అన్నం తిని పడుకోకూడదూ రేపు మాట్లాడు కుందాం," చెప్పి పుస్తకం తెరిచాను. 'లేదు. ఇపుడే మాట్లాడుకుందాం,' అనొచ్చుగా! అట్లా చెప్పలేదు. గాజుకిటికీ దగ్గరున్న బార్ స్టూల్‌ని ఒక్క తన్ను తన్నాడు. అది వెళ్లి టీపాయ్ మీద పడింది. దాని మీదున్న దంతపు ఫ్లవర్‌వేజ్ కిందపడి భళ్లున ముక్క లయింది. మా సాహచర్యంలో సదాశివ ఇంత వయొలెంట్‌గా ప్రవర్తించడం ఇదే మొదటిసారి.

పెద్ద శబ్దం తర్వాతి నిశ్శబ్దానికి కూడా చెవులు అలవాటుపడ్డాక ఇద్దరం కలిసి శిథిలాలను ఏరుతుంటే అపుడు అడిగాడు మొహమాటంగా, "అతనితో తెంపుకోలేవా నీలూ?" అని. ఎవరన్నా ఏమన్నా అడిగినపుడు ఇచ్చేయడమే చాలా సులువు. కాదని చెప్పడం ఎంత కష్టమో చెప్పేవాళ్లకే తెలుసు. గౌతమ్ నాకు సొంతమై ఉన్నాడా లేదా అని కాదు, అతనంటూ ఈ లోకంలో ఉండడమే నాకు ఒక సెలబ్రేషన్ అయినపుడు గట్టిగా హత్తుకుని ఉండడమూ విడిచిపెట్టి ఉండడమన్నది రెండు కాదు- ఒకటే. అయినా వచ్చేసిన పండగని వద్దు పొమ్మంటే పోతుందా? నేను గాజుపెంకుల కోసం మూలమూలలూ వెతుకుతుంటే తనే కంటిన్యూ చేశాడు.

“ఈ పదేళ్లుగా మనం ఫామిలీ లైఫ్‌లో స్థిరంగా ఉన్నాం కదా డిస్టర్బ్ చేసుకోవడం ఎందుకు? మనిద్దరం జీవితాంతం కలిసి ఉండాలనుకున్నాం. నాతో సమస్యల్లోంచి కాక నీ ఇష్టతలోంచి నువ్వటు మొగ్గుతున్నావు. అది నాకు చాలా భయంగా ఉంటోంది. నాతో సమస్యే అయితే అది ఏదోలా తీర్చుకోవచ్చు. కానీ కాదు. చాలా ఒత్తిడిగా ఉంటోంది. గట్టిగా చెప్పాలని ఉంది. ఇట్లా వద్దు. అతనితో మానెయ్. మనం హాయిగా ఉన్నాం. ఎప్పటికీ ఇలాగే ఉండగలం. నాకెంత కష్టంగా ఉందంటే పిచ్చివాడిలా అయిపోతున్నాను. ఓర్చుకోలేకపోతున్నాను,” పెంకులు అక్కడే పారేసి, అంతటి సదాశివా నేలమీద విసిరేసినట్లు కూలబడిపోయాడు.

అతని కష్టానికి నాకూ దుఃఖం వచ్చింది. తన చేతులు ఒళ్లోకి తీసుకుని నిమురుతూ కూచున్నాను. “నా వల్లకాదు...” చేతులు తోసేస్తూ అంటున్నాడు. మరి నా ఓర్పు నా భారం నా కష్టం సంగతేంటి? నాలో ఏదో రగులుతున్నట్లు అగ్నిపర్వతం బద్దలవుతున్నట్లు ఉంది. ఎలా ఓర్చుకోవాలో ఎలా భరించాలో అన్ని స్వేచ్ఛలనీ గట్టిగా నమ్మిన ఈ క్రిమినల్ లాయర్ సదాశివకి నేను చెప్పాలా?

కానీ చెప్పాలి. చాలా గుర్తుచేయాలి. ఎందుకు చెప్పాలనుకుంటున్నాను, ఎందుకు గుర్తు చేయాలనుకుంటున్నాను? తనకి పోటీగా వెళ్లి సమర్థించుకోడానికయితే కాదు. అది నాకు స్పష్టంగా తెలుసు. అలాంటి పోటీనో, తను చేసినపని నేనూ చేస్తే నొప్పి తగ్గుతుందనో తొలిరోజుల్లో ఉక్రోషం రాకపోలేదు. కానీ ఆ ఆలోచనలను అదుపు చేసుకున్నాను. ఎవరిమీద ఉక్రోషంతోనో ఇంకొకరితో చనువుగా ఉండటం అన్నది ఎంతటి పసితనపు అమాయకత్వమో పదేపదే చెప్పుకున్నాను. నా ఎంపికలు హృదయంలోంచి పైకి లేవాలి తప్ప ఆశాభంగాల పునాదుల మీద కట్టే ఏ బంధమూ నాకు శాంతిని ఇవ్వదన్నది అప్పటికే గ్రహించగలిగాను.

కానీ సదాశివకి ఇపుడు చెప్పాలి. సదాశివతో నాకున్న ప్రేమని పక్కనబెట్టి ఒక మానవసంబంధంగా ముందు దానిని నిలుపుకోవడానికి నేనెట్లా ప్రయత్నించానో చెప్పాలి. నా అనుభవం తనకి స్థిమితాన్ని ఇవ్వొచ్చన్న ఆశతో చెప్పాలి. చెప్పే తీరాలి.

✤

మా ఇద్దరి సహజీవనం మొదలయ్యేప్పటికే సదాశివ అంటే నాకు చాలా ఇష్టం. ఇద్దరం ఒక గూటి కిందకి వచ్చీరాగానే అతని హృదయంలోకి తొంగిచూసాను. ఎంత ఖాళీగా విశాలంగా ఉందో! నన్ను రారమ్మని పిలిచింది. వెంటనే ఒక రంగు రంగుల చాప తీసుకుని పరిగెత్తుకు వచ్చి అతని హృదయమంతా పరిచి దర్జాగా దాని మీదెక్కాను. కాసేపు పరుగులు పెట్టాను. కాసేపు బాసింపట్టు వేసుకు కూచున్నాను. కాసేపు నడుం వాల్చాను. కాసేపు చెవొగ్గి తన సంచలనాలు బాధలు నవ్వులు విన్నాను. అట్లా కాలు మీద కాలేసుకుని ఏలుతున్నానా?! ఓరోజు హఠాత్తుగా ఇంతలేసి కళ్ల పిల్ల, అదే... బాదంకాయ కళ్ల పిల్ల నేను పరుచుకున్న చాపమీదకి వచ్చి ఉడతపిల్లలా మిటుకూమిటుకూమని చూసింది. మీకు తెలుసా అపుడు

ఉడతపిల్ల కూడా భయపెట్టగలదని! నిజానికి భయమో అభద్రతో ఏదో నాలో ఇంకేలోపే ఆ పిల్ల సదాశివ ప్రేమని వాత్సల్యాన్ని కొద్దిగా కొరికి చూసి పారిపోయింది.

కానీ లవ్లీ లాయరమ్మ అని సదాశివ ముద్దుగా పిలుచుకునే ఆమె మాత్రం గొప్ప మాంత్రికశక్తితో సివంగిలా దూకింది. ఆ దూకుడు చూడగానే అర్థమైపోయింది ఆమె శక్తి ఏంటో! సన్నగా తెల్లగా పొడవుగా ఉండే లాయరమ్మ, మృదువైన మాటల లాయరమ్మ తన సమస్తాన్నీ త్యజించిన ప్రేమతో సదాశివని ఆరాధించింది. సదాశివే ఆమెని తన హృదయంలోకి వెంటబెట్టుకుని వచ్చాడు. నేను నా రంగురంగుల చాప అంచుల్ని గట్టిగా బిగించి పట్టుకుని కొన్నాళ్లు బెట్టుగా బింకంగా ఉండిపోయాను. కానీ ఎక్కువ కాలం సాధ్యం కాలేదు. నాకు అక్కడ చోటు తరిగిపోతోంది. రంగుల చాప కుంచించుకుపోతోంది. నన్నెవరో నెట్టేస్తున్నట్లు ఎందులోనో కుక్కేస్తున్నట్లు ఇరుగ్గా ఉక్కిరిబిక్కిరిగా అయిపోయాను. కొండంత నన్ను పిడికిలంత చేస్తున్నందుకు ఎవర్ని నిందించాలి? ఎవరితో పోట్లాడాలి? వచ్చినవాళ్లే తిరిగిపొండి ఈ చోటంతా నాదే నాదే అని గొంతు పగిలేలా అరవాలనిపించింది. ఇతను నా ఒక్కదాని వాడు నువ్వు పో అని ఒక చింతరువ్వ తీసుకుని ఆ ఎల్లాపిగత్తె వెంటబడి తోలెయ్యాలని పించేది. ఏడ్చి మొత్తుకుని సదాశివ మనసు మళ్లించాలి అనిపించేది. కానీ అట్లా చేయడం నావల్ల కాలేదు. ఒకరినొకరం వారి సమస్తంతో సహా అర్థం చేసుకోవడం సాధన చేసినవాళ్లం కదా!

ఏం చేయాలో తెలీని నిస్సహాయతలో నుంచి అపుడు నేనొక పనిచేశాను. తనని లాక్కోడానికి పోటీపడటం, నిందించడం, విడిపోవడం, ద్వేషించడం, కక్షతో వేరే సంబంధంలోకి వెళ్లడం, అందరికీ చెప్పుకుని వాపోవడం లాంటివి చేయలేదు. ఏం చేసానంటే సదాశివని మరింత ప్రేమించడం మొదలుపెట్టాను. కోపం, భయం, ద్వేషం పగ అన్నింటినీ విసిరికొట్టి ప్రేమించడం ఒకటే నాకు బాగా తెలుసునన్నట్లుగా ప్రేమించాను. లాయరమ్మతో పోటీపడి కాదు. అప్పటివరకూ విశాలంగా పరుచుకుని హొయలు పోయిన రంగురంగుల నా ఆశల చాపని చుట్టగా చుట్టి తట్టాబుట్టా సర్ది చంకనబెట్టుకుని తన హృదయంలోనే ఓవారగా నిలబడి అది ఆడుతున్న సయ్యాటల్ని చూస్తూ మరీ ప్రేమించాను.

ఎందుకట్లా ఇదేం త్యాగం?! కోప్పడింది సన్నిహితురాలైన కామన్ ఫ్రెండ్. నన్ను ప్రేమించిన సదాశివని మాత్రమే నేను ప్రేమించలేదని చెప్పాను. సదాశివ అంటే ఉత్తిచేతులతో సాయం కోరేవారికి మేలుచేసే మంచి లాయర్ అనీ, సంస్కార వంతుడనీ, లోకాన్ని మెరుగ్గా అర్థం చేసుకోగల సమర్థుడనీ తను నాకు ఏదో ఒక స్థాయిలో తప్పకుండా కావాలి అన్నది అర్థమయ్యాక ప్రేమించడం ఒకటే నేను చేయగలపనిగా తోచింది.

నా మాటలు మధ్యలోనే ఆపేశాడు సదాశివ. అతని మొహం ఎర్రబారి పోతోంది. భరించలేకపోతున్నాడు. తను పొందిన దానికి ప్రతిగా నేనేం కోరతానోనని భయపడుతున్నాడు. చటుక్కున లేచి గాజుపెంకులు చెత్తబుట్టలో వేసి స్టూల్

బాల్కనీలో పెట్టి చేతులు కడుక్కుని వచ్చాడు. పడకగదిలో ఉన్న మినీ ఫ్రిజ్ తెరిచి సోడాబాటిల్ తీసాడు. పళ్లెంలో ఉన్న మంచింగ్స్ నావైపు తోస్తూ సజెస్టివ్‌గా గ్లాస్ చూపించాడు.

"నాకు ఇపుడొద్దు," అన్నాను.

చిత్రంగా కళ్లెగరేసి, "కొత్త పాతివ్రత్యమా?" అనేసి తమాయించుకుంటూ సారీ చెప్పి, అయినా సరిపోనట్లు, "అతనికి అలవాటు లేదా?" వేవరింగ్‌గా ఉన్న గొంతుతో అన్నాడు.

"నీకు గౌతమ్ మీద కన్సర్న్ లేకపోయినా పర్లేదు. కానీ మనిషి అన్న గౌరవం అయినా ఉంటే తన గురించి ఇష్టంతో ఎంతైనా చెప్పుకోగలను. కానీ నేను ఇపుడేం మాట్లాడినా నీకు బాధ కలుగుతుంది. ఇక ఎందుకు చెప్పు?"

ఒక గ్లాసు పక్కకి నెట్టేసి రెండో గ్లాసు బుగ్గకి ఆనించుకుంటూ, "ఒంటరి గ్లాసువాడినయ్యానన్నమాట," అన్నాడు. లావెండర్ కలర్ డావిన్సీ క్రిష్టల్ గ్లాసులవి. ఒక గ్లాసు మీదే లెక్కపెట్టలేనన్ని చిన్నిచిన్ని పలకలు. ప్రతి పలక మీదా సదాశివ రూపం కనపడుతోంది. అనేక సదాశివలు.

✤

మనుషులు బాగా నచ్చినపుడే కాదు. అస్సలు నచ్చక శత్రువర్గంగా మారి పోయినపుడు కూడా ప్రత్యేకమైన కుతూహలం ఉంటుందనుకుంటాను. అట్లాంటి కుతూహలంతోనే కాబోలు ఆరోజు తన స్నేహితుడు ఏర్పాటుచేస్తున్న చిన్న గాదరింగ్‌కి గౌతమ్‌ని కూడా పిలిచాడు సదాశివ. పబ్లిక్ ఎటెన్షన్ బాగా ఉండి, గత పదేళ్లుగా నలుగుతున్న ఒక కేసులో బాధితుల్ని గెలిపించగలిగాడు సదాశివ. ఆ సందర్భంగా అతన్ని అభినందించడానికి ఈ చిన్న కార్యక్రమం. ఈ కేసు గెలవడం మానసికంగా తనకి ఎంత సంతృప్తినిస్తుందో ఈ పదేళ్ల కాలంలో అతని ఒత్తిడిని బట్టి గ్రహించ గలను.

పార్టీకి తన సన్నిహితులు పాతికమంది వరకూ వచ్చారు. గౌతమ్ కూడా వచ్చాడు. ఈ కేసు సందర్భంగా తన అనుభవాలు చెపుతూ ఎవరెవరి నుంచి ఎన్ని ఒత్తిళ్లు వచ్చాయో తనెట్లా నలిగిపోయాడో చివరికి ఎట్లా స్థిరంగా నిలబడిపోయాడో చెపుతున్నపుడు చాలామంది కళ్లు తడి చేసుకుని దగ్గరకి వచ్చి మరీ తనని కావిలించు కున్నారు. అపురూపమైన వ్యక్తి కదా ఆ బహుమానాలు సహజమే. తనింకా చెపుతూ ఒకటి రెండు సందర్భాల్లో తనలో తీవ్రమైన డిప్రెషన్ సూచనలు కనిపించాయని అపుడు ఒక వ్యక్తి విలువైన స్నేహం ద్వారా తనని నిలబెట్టిందని చెపుతూ ఆగాడు.

నేను లాయరమ్మ వంక చూశాను. ఆమె తలవంచుకుని చిన్నగా మురిపెంగా నవ్వుకుంటోంది. నేను తన మురిపెం వంక ఇష్టంగా చూస్తూనే ఉన్నాను, ఇంతలో ఊహించని విధంగా సదాశివ దగ్గరగా వచ్చి నా నడుము చుట్టూ చేయి చుట్టి, "థాంక్ యూ నీలూ!" అన్నాడు.

వావ్... అంటున్న అందరి చప్పట్ల హోరులోంచి లాయరమ్మని చూశాను.

నా జీవితంలోకెల్లా అత్యంత అవమానంతో సిగ్గుపడిన క్షణాలవి. లాయరమ్మ మొహంలో కనిపిస్తున్న భావాన్ని నేను చదవగలనా? చూస్తూ చూస్తూ ఉండగానే మనకి తోడయిన మనిషి వేళ్ల కింద ఇసుకలా మెత్తగా జారిపోతున్నపుడూ, అప్పటి వరకూ మనమీదే స్థిరంగా ఉన్న మాటలూ చూపులూ నవ్వులూ నడకలూ ఉద్వేగాలూ మనల్ని ఖాళీ చేసో మరో పాయ తీసుకునో మరోవైపు పరుగులెడుతున్నపుడూ ఖాళీ అయినంత మేరా డొల్లబారి జవజవలాడే మనుషుల మొహాల్లో ఏ భావం ఉంటుంది! బహుశా ప్రేమ లేకపోయినందుకు కాదేమో ఎవాయిడ్ చేయబడుతున్నందుకు, 'నా జీవితానికి అతుక్కుపోయేంతగా ప్రేమించకు, ఆశించకు,' అని ఈ విధంగా తెలియ జెపుతున్నందుకు, చిటికేస్తే రాలిపడే ప్రేమలకన్నా ఈ ఒంటరి మహానగరాల్లో నా చిన్ని కుటుంబమే నాకు చాలా ముఖ్యం అని ప్రకటిస్తున్నందుకు, రోదసీ నుంచి భూకక్ష్యలోకి ప్రవేశించే వ్యోమనౌక ఫెయిలయ్యి పేలిపోయినంత భీభత్సం ఆమె మొహంలో.

"నాకు ఇన్‌స్టిట్యూషనల్ గౌరవం బాగానే దక్కించావు!" తిరిగొస్తున్నపుడు కారులో ఈ మాట అనకుండా ఉండలేకపోయాను.

"ఏం! గౌతమ్ ఉన్నందుకు ఇబ్బందిపడ్డావా?" సదాశివ తాపీగా సమాధానం ఇచ్చినప్పుడు అర్థమైంది గౌతమ్‌ని  ఎందుకు పిలిచాడో. ఇంటికొచ్చేవరకూ ఆ షాక్ నుంచి తేరుకోలేకపోయాను.

రాగానే సోఫాలో కూలబడి టీవీ పెట్టి దానివైపు చూడకుండా సీలింగ్ చూస్తూ కూచున్నాడు. అరగంట అయినా అదే పరిస్థితి. "మనుషులకి అన్నిరకాల స్వేచ్ఛలూ ఉండాలని అదే అంతిమవిలువ అనీ నువ్వే ఎన్నోసార్లు వాదించావు. దానిని ఇద్దరం నమ్ముతున్నాం కూడా కదా? మరిక ఈ విషయాన్ని నా విజ్ఞతకే వదిలేయకూడదా? నిన్ను దాటిపోవాలని నాకేంలేదు. దాటిపోయే అయిష్టతా లేదు. పోనీ అతన్నలా నా జీవితంలో ఓ పక్కగా ఉండనీయి. నీకేం అడ్డు సదా?" అతనికి ఎదురుగా కూచుని అడిగానేమో మరీ స్పష్టంగా కనపడుతున్నాడు.

నా మాటలు వినగానే కాదన్నట్లు చేతులు గాలిలోకి విసిరాడు. తల అడ్డంగా ఊపుతూ ఆరోపణ ధ్వనిస్తున్న గొంతుతో, "అతనేం పక్కగా లేడు. నిన్ను లాగేసు కుంటున్నాడు. లైక్ ఎ బ్లాక్‌హోల్. అయినా నీలూ మనిద్దరం జీవితాంతం కలిసుండా లని సహజీవనంలోకి వచ్చాం. అపుడు మిగతా స్నేహాలు నో స్ట్రింగ్స్ అటాచ్డ్‌గా ఉండాలి. కానీ నువ్వతనితో ఎమోషనల్‌గా ఉంటున్నావు. బాహాటంగా ఓపెన్ అవు తున్నారు మీరిద్దరూ!"

మన ఆచరణ శక్తి ఎంతవరకో అంతవరకూ ఉన్నదే విప్లవమన్న మేధావులను లోకం చాలానే చూసింది. సదాశివ ఇంతవరకూ రాగలిగాడు కనుక అతని పాటికిదే న్యాయం. నేను మాట్లాడకపోయేసరికి నిస్పృహగా మొహాన్ని చేతులతో రుద్దుకుంటూ, "ఏం జీవితాలివి! అందరికీ ఏవో ఖాళీలు. ఏంచేస్తాం? ఎవరి మార్గాల్లో వాళ్లు వెతుక్కుం

టారు. కానీ ఉన్నంతలో ప్రాక్టికల్‌గా ఇబ్బందులు లేకుండా కాస్త తెలివిగా ఉండాలి కదా నీలూ? డ్యూయల్ వాల్యూస్ ఉండకూడదని నా సంస్కారం పదేపదే హెచ్చ రిస్తుంది కనుక చెప్తున్నా. నీకు ఎవరి పట్లయినా ఆకర్షణ కలిగితే వన్ నైట్ స్టాండ్ తీసుకో. లేదూ కాదూ అంటే కాజువల్ రిలేషన్‌షిప్‌లో ఉండు,'' గాయపడి రక్త మోడుతున్న పావురంలా విలవిలలాడుతున్నాడు సదాశివ.

చప్పున లేచి వెళ్లి తన భుజాల చుట్టూ చేతులు వేసి, ''అట్లా హింసించుకోకు సదా! ప్లీజ్,'' నా నెప్పిని దాచిపెట్టుకుంటూ ఓదార్చబోయాను.

''...నాకే శక్తి ఉంటే నేనే నీకు సమస్తమూ అవ్వాలని ఉంటుంది. అది సాధ్యమైతే ఎంత బావుండేది నీలూ ! కానీ అట్లా కాలేదు. నా వల్లనే కాలేదు. నీకు నిలకడగా స్థిరంగా తదేకంగా ఉండే బంధం కావాలి నాకు తెలుసు. నేనట్లా కాలేక పోయాను. గౌతమ్ మాత్రం కాగలడా!?''

లాజిక్ వరకూ అయితే తన ప్రశ్నకి తిరుగులేదు. ''నిజమే సదా!'' ఒప్పు కున్నాను.

''ఇక ఇపుడు నేనేం చేయగలను! ఏం చేస్తే ఈ నెప్పి పోతుంది నీలూ?''

నా వంకే దీర్ఘంగా చూస్తున్నాడు. నేనూ చూపు కలిపాను.

ఎంతసేపో అలా...

తనకి చాలా ఇష్టమైన ఎడతెగని నా కంటిచూపుని తాడువలే పేని మెడకి చుట్టుకుంటున్నట్లు అభినయించి, ''చచ్చిపోనా పోనీ?'' అన్నాడు.

''రా.''

వచ్చాడు. ఎప్పట్లాగా తెల్ల పూలదండ అంచుల సముద్రుడై రాలేదు. విలయం సృష్టించే సునామీలా వచ్చాడు. నా మనశ్శరీరాలతో సంభాషించడానికి రాలేదు. నా హృదయంలోని ప్రియమైన వ్యక్తి ఉనికిని నిర్మూలించాలన్న క్రోధంతో వచ్చాడు.

జీవితం నాటకం కాదు గదా తెరపడేలోపు యుద్ధం ముగియడానికి!

*ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక*
*జూన్ 2016*

✻



27 డిసెంబర్ 1970న పశ్చిమ గోదావరి జిల్లాలో కె.ఎన్. మల్లీశ్వరి జన్మించారు. వీరి మొదటి కథ ***పోరాటం*** 2005, ఈనాడు ఆదివారంలో అచ్చయింది. మూడు కథాసంపుటాలు, ఐదు నవలలు, నాలుగు వ్యాససంపుటాలు, ఒక స్మృతిరచన ప్రచురించారు. ప్రజాస్వామ్య రచయిత్రుల వేదికలో చురుకైన పాత్ర నిర్వహిస్తున్నారు.

***చిరునామా: 39-5-11, సెకండ్ లే ఔట్, మురళీనగర్,***
***విశాఖపట్నం - 530 007   ఫోన్: 92466 16788***
***malleswarikn2008gmail.com***